నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శుక్రవారం 3 మే 2024 | KHAMMAM



సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా, చిత్రంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు తదితరులు

# కంకణబద్ధులమై పనిచేద్దాం

- ఈ లోక్‌సభ ఎన్నికల్లో చరిత్రను తిరగరాయబోతున్నాం
- కాంగ్రెస్ మోసంపై ప్రజలు పునరాలోచన చేస్తున్నారు
- గడపగడపకూ వెళ్లి ప్రజలను కలిసి మమేకం కావాలి
- కార్యకర్తల సమావేశంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామా
- హాజరైన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, ఎమ్మెల్సీ మధు

ఖమ్మం, మే 2: ఈ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అందరమూ కంకణబద్ధులమై పనిచేద్దామని ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ మోసంపై ప్రజలు పునరాలోచన చేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు గడపగడపకూ వెళ్లి కాంగ్రెస్ మోసాన్ని వివరించాలని, ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ఖమ్మం స్థానంలో అధిక మెజార్టీ సాధించేందుకు శక్తివంచన లేకుండా శ్రమించాలని కోరారు. ఖమ్మం బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన ఖమ్మం టూ టౌన్ ఏరియా పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమయం తక్కువగా ఉన్నందున అందరమూ కలిసి కష్టపడి పని చేద్దామని అన్నారు. జిల్లాలో పార్టీ అధినేత కేసీఆర్ సభలు సక్సెస్ అయ్యాయని, ప్రజల్లో ఎంతో ఆదరణ లభించిందని అన్నారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ చేసిన మోసాలపై ప్రజల్లో విస్తృత చర్చ నడుస్తోందని అన్నారు. కార్యకర్తలే పార్టీ కథానాయకులైనందున ఈ కొన్ని రోజులపాటు బూత్ స్థాయి నుంచి రేయింబవళ్లూ పనిచేయాలని కోరారు.

### 'నామా'తోనే రాష్ట్ర ప్రయోజనాలు సాధ్యం: వద్దిరాజు

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. నామా నాగేశ్వరరావుతోనే రాష్ట్ర, జిల్లా ప్రయోజనాలు సాధ్యమవుతాయని అన్నారు. అందుకని ఈ ఎన్నికల్లో ఆయనను తప్పనిసరిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నిత్యం ప్రజల మధ్యే ఉంటారని అన్నారు. కానీ ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు ఎక్కడుంటారో తెలియని దుస్థితి ఉందని విమర్శించారు. ప్రత్యర్థి పార్టీ నేతలు ఉద్దేశపూర్వకంగానే ఈసీకి ఫిర్యాదు చేసి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను 48 గంటలపాటు ప్రచారానికి దూరం చేశారని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు పగడాల నాగరాజు, శీలంశెట్టి వీరభద్రం, బుర్రి వెంకట్, పొన్నం వెంకటేశ్వర్లు, వెంకటరమణ, తారపు సుధాకర్, దోరేపల్లి శ్వేత, పగడాల శ్రీవిద్య, వినయ్, పార్థసారథి, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

### మంచి మెజార్టీతో గెలవబోతున్నాం: తాతా మధు



ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు మాట్లాడుతూ.. ఖమ్మం స్థానంలో పార్టీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు మంచి మెజార్టీతో గెలవబోతున్నారని అన్నారు. 13న జరిగే ఎన్నికల్లో చరిత్ర తిరగరాయబోతున్నామని స్పష్టం చేశారు. పార్టీ ఇచ్చిన గౌరవాన్ని నిలబెట్టుకుందామని అన్నారు. రాష్ట్రంలోని 12 సీట్లలో బీఆర్‌ఎస్ గెలవబోతున్నట్లు సర్వేలు చెబుతున్నాయన్నారు. కేసీఆర్ సభలకు వచ్చిన జనాన్ని చూసి కాంగ్రెస్‌కు వణుకు పుట్టిందని అన్నారు. ఆ పార్టీ తీరుపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని అన్నారు.

# నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ

మామిళ్లగూడెం, మే 2 : పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను శుక్రవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు చేపడుతున్నట్లు ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోస్టల్ బ్యాలెట్ బృందాలకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ఓటింగ్‌కు ముందే పూర్తి చేయనున్నట్లు తెలిపారు. 85 ఏళ్ల పైబడిన వారు, దివ్యాంగులు ఎవరైతే పోలింగ్ కేంద్రానికి రాలేక పోతున్నారో వారి వద్దకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎస్సెన్షియల్ సర్వీసెస్ ఎఫ్‌సీఐ, ఇండియన్ రైల్వే, ఫైర్, విద్యుత్, వైద్య ఆరోగ్య, ఆర్టీసీ, పౌరసరఫరా, బీఎస్‌ఎన్‌ఎల్, గుర్తింపు పొందిన మీడియా వారికి పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధుల్లో ఉన్న వారికి ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్ జారీ చేసి, వారు విధులు నిర్వర్తించే చోట ఓటు హక్కు వినియోగించేలా చర్యలు చేపట్టామన్నారు. ఏరోజు కారోజు పోలైన పోస్టల్ బ్యాలెట్లు, పోల్ కాని పోస్టల్ బ్యాలెట్లు సంబంధిత సహాయ రిటర్నింగ్ అధికారికి అప్పగించాలన్నారు. కాగా.. దీనిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

# నయా జోష్

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పెరిగిన 'కారు' స్పీడు
- నూతనోత్సాహం నింపిన కేసీఆర్ బస్సుయాత్ర
- రెండు రోజుల రోడ్‌షోలకు పోటెత్తిన జనవాహిని
- టూర్ సక్సెస్‌తో ప్రత్యర్థి పార్టీల్లో గుబులు మొదలు
- ఏర్పాట్లు, జయప్రదంపై నేతలకు అధినేత కితాబు







టేకులపల్లిలో కేసీఆర్ బస్సు యాత్రకు ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు, అభిమానులు (ఫైల్)

ఖమ్మం, మే 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించిన బస్సుయాత్ర, రోడ్‌షోలు ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపాయి. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం, మహబూబాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థులు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత విజయం కోసం ఉద్యమ నేత కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో రెండు రోజులపాటు పర్యటించి ప్రచారం చేయడంతో నాయకులు, కార్యకర్తల్లో సరికొత్త జోష్‌ని నింపినట్లయింది. రోడ్‌షోల అనంతరం ఈ ఎన్నికలపై పార్టీ నేతలకు దిశానిర్దేశం కూడా చేశారు. అలాగే, తాను బస చేసిన ప్రాంతాల వద్దకు తన కోసం వచ్చిన ప్రతి కార్యకర్తనూ ఆయన కలిశారు. దీనిద్వారా కార్యకర్తలతో తనకు గల అనుబంధాన్ని చాటి చెప్పారు. ఉద్యమ నేత బస్సుయాత్ర ఖమ్మం జిల్లాలోకి ప్రవేశించింది మొదలుకొని మహబూబాబాద్‌లోకి చేరుకునేంత వరకూ అశేష ప్రజావాహిని ఆయన బస్సుయాత్రను అనుసరించింది. ఖమ్మం, కొత్తగూడెం రోడ్‌షోలకు జనం ప్రవాహంలా కదిలివచ్చారు. ఖమ్మం రోడ్‌షోలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన తీరు, పార్టీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును గెలిపించుకుంటే వచ్చే సంకీర్ణ ప్రభుత్వంలో మంత్రి అయ్యే అవకాశం ఉందని చెప్పిన విధానంతో శ్రేణుల్లో జోష్ పెరిగింది. కొత్తగూడెంలో ఉర్దూలో ప్రసంగించిన తీరు అక్కడి ముస్లిం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను వివరించడంతో రైతుబంధు, కల్యాణలక్ష్మి వంటి పథకాలు, సీతారామ ప్రాజెక్టులపై ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి వెల్లడైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను కేసీఆర్ తన ప్రసంగాల్లో కళ్లకు కట్టినట్లుగా చూపించారు. దీంతో ఆయా ప్రభుత్వాల విధానాలు, ప్రజలపై ఆ ప్రభుత్వాలు చూపే కపట ప్రేమలు జనాల్లోని ఆలోచనలను మేల్కొలిపాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే కలిగే ప్రయోజనాలను వివరించడంతో పార్టీ శ్రేణులతోపాటు సాధారణ ఓటర్లలోనూ సానుకూల ఆలోచనలు ప్రారంభమయ్యాయి.

### ప్రత్యర్థులను ఆత్మరక్షణలో పడేసేలా..

ఉమ్మడి జిల్లాలోని రోడ్‌షోల్లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ముఖ్యంగా ప్రత్యర్థి పార్టీల వైఫల్యాలను, ప్రజలకు అవి చేస్తున్న మోసాలను ఎండగట్టడంతో కాంగ్రెస్, బీజేపీలు ఆత్మ రక్షణలో పడ్డాయి. స్థానిక అంశాలతోపాటు కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలను ఈ ప్రభుత్వం రద్దు చేస్తామంటోందనే విషయాన్ని కేసీఆర్ తన ప్రసంగంలో ప్రస్తావించడంతో ఆయా జిల్లాల ప్రజలను అప్రమత్తం చేసింది. సింగరేణి మనుగడ, కార్మికుల సంక్షేమం విషయంలో మోదీ, రేవంత్ ప్రభుత్వాలు చేస్తున్న దగాను వివరించడంతో సింగరేణి కార్మికులను లోతైన ఆలోచనల్లోకి దింపాయి. ఇవన్నీ అటు ప్రజలు, కార్మికులతోపాటు ఇటు పార్టీ శ్రేణులనూ ఆలోచింపజేశాయి. ముఖ్యంగా నాయకులు, కార్యకర్తల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచాయి. వారు పార్టీ కోసం మరింత కసిగా పనిచేసేలా దిశానిర్దేశం చేశాయి. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయావకాశాలను అధినేత విడమరిచి చెప్పడంతో శ్రేణులు కూడా పూర్తిస్థాయిలో పోరుసల్పాలన్న కృతనిశ్చయానికి వచ్చాయి. మున్ముందు పార్టీకి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందనే మనోధైర్యాన్ని కల్పించాయి.

### రోడ్‌షో ముగిసిన వెంటనే సమీక్షలు

ఖమ్మం, కొత్తగూడెంలలో రోడ్‌షోలు ముగిసిన వెంటనే పార్టీ కీలక నేతలతో రెండుచోట్లా కేసీఆర్ సమీక్షలు జరిపారు. పార్టీ విజయావకాశాలు, మెజార్టీ అంశాలు, సర్వేల్లోని సానుకూలతలను వివరించి దిశానిర్దేశం చేశారు. అలాగే, బస్సుయాత్ర, రోడ్ షోలకు అనూహ్య స్పందన రావడం, విజయవంతం కావడం, ఏర్పాట్లు అద్భుతంగా ఉండడంతో నేతలను ఆయన అభినందించారు. కాగా, ఇవన్నీ ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయాలకు సంకేతమనే ఉత్సాహాన్ని నింపాయి.

### ప్రత్యర్థి పార్టీల్లో మొదలైన గుబులు..

గులాబీ దళపతి టూర్ సక్సెస్ కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నిండగా.. ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల్లో గుబులు మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాతి నిస్తేజాన్ని పక్కనపెట్టి నడుంబిగిస్తే విజయం ఖాయమన్న విషయం శ్రేణులకు స్పష్టమైంది. ఇదే అంశం ప్రత్యర్థులకు నిద్రపట్టనీయకుండా చేసింది. కాగా, పార్టీ అధినేత టూర్ సక్సెస్‌లో పార్టీ నేతలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, పువ్వాడ అజయ్‌కుమార్, తాతా మధు, వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోతు మదన్‌లాల్, మెచ్చా నాగేశ్వరరావు, హరిప్రియ, లింగాల కమల్‌రాజు తదితరులు కీలకపాత్ర పోషించారు. యాత్రలో భాగంగా కేసీఆర్‌ను కలిసిన మరో రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి కూడా జిల్లా రాజకీయాలపై చర్చించారు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి కొత్తగూడేనికి బస్సుయాత్రగా బయల్దేరిన కేసీఆర్‌కు కొణిజర్ల వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలే ఏకంగా అభివాదం చేసి అభిమానాన్ని చాటుకోవడం ఆసక్తిని కలిగించింది.

# నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి

**వీసీలో సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్**



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మే 2 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని, పోటీ చేస్తున్న అభ్యర్థులను ఒకే తరహాలో చూడాలని సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నితేష్ వ్యాస్ అన్నారు. గురువారం న్యూఢిల్లీ నుంచి సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ సన్నద్ధతపై నిర్వహించిన వీసీలో హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి పాల్గొనగా.. ఐడీవోసీ నుంచి కలెక్టర్ ప్రియాంక ఆల, ఎస్పీ రోహిత్ రాజు, వ్యయ పరిశీలకులు రామ్‌కుమార్, గోపాల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రియాంక ఆల మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 71 శాతం ఓటరు సమాచార స్లిప్పులు పంపిణీ చేశామని, మిగిలినవి సైతం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాకు కొత్తగా కేటాయించిన 1,700 బ్యాలెట్ యూనిట్లను రెండు రోజుల్లో ర్యాండమైజేషన్ పూర్తి చేసి అన్ని నియోజకవర్గాలకు పంపిణీ చేశామని తెలిపారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రభావం లేకుండా అప్రమత్తంగా ఉంటూ ఎక్కడికక్కడ తనిఖీలు చేపట్టామన్నారు. సీ విజిల్, 1950 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా కట్టుదిట్టమైన భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎంల తరలింపు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వ్యయ పరిశీలకులు రామ్‌కుమార్, గోపాల్ మాట్లాడుతూ చెక్ పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని, ఎంసీసీలో ఎఫ్‌ఎస్‌టీ, వీఎస్‌టీలో మోడల్ కండక్ట్ కోడ్ ఉల్లంఘించిన వారిపై తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలన్నారు. వీసీలో ఏఆర్‌వోలు ప్రతీక్ జైన్, వేణుగోపాల్, మధు, దామోదరరావు, కాశయ్య, ఎలక్షన్ సూపరింటెండెంట్ దారా ప్రసాద్, డీసీవో సయ్యద్ ఖుర్షీద్ పాల్గొన్నారు.

# ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ తనిఖీ



ఈవీఎంల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, మే 2 : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం, వీవీ ప్యాట్ల గోడౌన్‌లో చేపట్టిన అదనపు ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్‌ను ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం ఎంపీ ఎన్నికల్లో 35 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, నోటాతో కలిపి 36 అవుతున్నారని తెలిపారు. ఒక్కో బ్యాలెట్ యూనిట్లో 16 మంది అభ్యర్థులకు అవకాశం ఉన్నందున ఎన్నికల నిర్వహణకు 3 బ్యాలెట్ యూనిట్ల అవసరం ఉందన్నారు. దీనికి అదనపు ఈవీఎంలను సిద్ధం చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈవీఎం గోడౌన్‌లో ఉన్న వైరా అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందిన 252 బ్యాలెట్ యూనిట్లు, 252 కంట్రోల్ యూనిట్లు, అద
న ం గా
కే టా
యించిన 2,200 బ్యాలెట్ యూనిట్ల ఫస్ట్ లెవల్ చెకింగ్‌ను పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికకు తొలిరోజు మూడు నామినేషన్లు

- ఈ నెల 9 వరకు నామినేషన్ల స్వీకరణ, 10న స్క్రూట్నీ, 13న ఉపసంహరణ
- 27న పోలింగ్, జూన్ 5న ఫలితాల వెల్లడి

నల్లగొండ, మే 2 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఉప ఎన్నికలో భాగంగా మొదటి రోజు గురువారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. ప్రజావాణి పార్టీ తరపున పాటి శ్రీకాంత్‌రెడ్డి ఒక సెట్, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా బండారు నాగరాజు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం ఉపఎన్నికకు గురువారం ఉదయం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన నోటిఫికేషన్ జారీ చేసిన అనంతరం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 9 వరకు ఈ ఎన్నికకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ జరుగనుండగా.. 10న స్క్రూట్నీ, 13న ఉపసంహరణ అనంతరం అదే రోజు అభ్యర్థుల జాబితా, గుర్తులను కేటాయిస్తూ విడుదల చేయనున్నారు. ఈ నెల 27న పోలింగ్ నిర్వహించి వచ్చే నెల 5న ఫలితాలు వెల్లడించనున్నట్లు రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన తెలిపారు.

# మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

**లోక్‌సభ ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ సంజయ్ జి కోల్టే**



మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ సంజయ్ జి.కోల్టే

మామిళ్లగూడెం, మే 2 : పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో మైక్రో, జనరల్ అబ్జర్వర్ల పాత్ర ఎంతో కీలకమని, ఎన్నికల నిర్వహణకు వారు కళ్లు, చెవుల లాంటి వారని ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ డాక్టర్ సంజయ్ జి కోల్టే అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన రెండో విడత శిక్షణా కార్యక్రమానికి ఆయన హాజరై అవగాహన కల్పించారు. ఒకే లొకేషన్‌లో ఒకటి కన్నా ఎక్కువ పోలింగ్ కేంద్రాలున్న ప్రాంతాల్లో మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. ఈ నెల 12న పోలింగ్‌కు ఒకరోజు ముందు మైక్రో అబ్జర్వర్లు వారి వారి నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద ఉదయం 8 గంటలకు రిపోర్ట్ చేయాలని, అక్కడి నుంచి పోలింగ్ సిబ్బందితోపాటు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. పోలింగ్ ముగిసిన తర్వాత నియోజకవర్గం మొత్తానికి ఒకేచోట శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రంలో నివేదికలు సమర్పించాలన్నారు. మాక్ పోలింగ్ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి ఎవరెవరు ప్రవేశిస్తున్నది, ఎంత మంది పార్టీల ఏజెంట్లు పోలింగ్ కేంద్రంలో ఉన్నది చూసుకోవాలన్నారు. ఇండెలిబుల్ ఇంక్ సరిగా చేస్తున్నది అధికారులు పరిశీలించాలన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ.. తమ విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మైక్రో అబ్జర్వర్లకు విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిక్షణ నోడల్ అధికారి, జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, ఎల్డీఎం శ్రీనివాసరెడ్డి, జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్ కె.శ్రీరామ్, మదన్‌గోపాల్, అధికారులు పాల్గొన్నారు.





కొత్తగూడెంలో ఎండ వేడికి నిర్మానుష్యంగా ముర్రేడు వద్ద రహదారి





తలకు చున్నీ చుట్టుకొని జాగ్రత్తలు పాటిస్తున్న మహిళలు

# నెత్తిన నెగడు

- భద్రాద్రి జిల్లాలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు
- నిర్మానుషంగా మారిన ప్రధాన రహదారులు
- డేంజర్ జోన్‌లో ఉన్నట్లు ప్రకటించిన వాతావరణ శాఖ
- అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రియాంక సూచన



భద్రాద్రి కొత్తగూడెం, మే 2 (నమస్తే తెలంగాణ) : ఎండలు నెత్తిన నెగడులా మారాయి. భానుడి ప్రతాపంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నిప్పుల కొలిమి అయ్యింది. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో డేంజర్ జోన్‌లో ఉన్నట్లు వాతావరణ శాఖ ప్రకటించడంతో జిల్లా ప్రజలు బెంబేలెత్తుతున్నారు. 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైతే అలర్ట్‌గా ఉండాలని, దాటితే వార్నింగ్‌లో ఉన్నట్లుగా పరిగణించాలని పేర్కొంది. వారం రోజుల నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. బుధవారం నుంచి 45 డిగ్రీలు దాటి నమోదవుతోంది. జిల్లాలోని 14 గ్రామాల్లో 46 డిగ్రీలకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ఎండల తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. భద్రాచలం పట్టణంలో అత్యధికంగా 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతోపాటు అశ్వాపురం, పాల్వంచ, చుంచుపల్లి, మణుగూరు, దుమ్ముగూడెం, దమ్మపేట, జూలూరుపాడు, చండ్రుగొండ, లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం మండలాల్లో ఎండ తీవ్రతతో గాలులు ఎక్కువగా వీస్తున్నాయి. ఇంట్లో ఉన్న వారు కూలర్లు, ఏసీలు పెట్టుకున్నా ఎండ తీవ్రతకు వాటి గాలి కూడా సరిపోని పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసిన నాయకులు కార్యకర్తలను ఎండలో తిప్పడంతో గంటల వ్యవధిలోనే సుడిపడి పోతున్నారు. మరోవైపు తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలో బయటకు వస్తే ఇంటికి రాగానే వడదెబ్బ తగిలి తీవ్ర అస్వస్థతకు గురికావడంతోపాటు ఆస్పత్రి పాలవుతున్నారు.

### భద్రాద్రి జిల్లాలో డేంజర్ బెల్స్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వాతావరణ శాఖ ఎండ తీవ్రతను బట్టి వార్నింగ్ లెవల్స్‌ను చూపిస్తోంది. 45 డిగ్రీలు దాటితే వార్నింగ్ ఇస్తున్నట్లుగా ప్రకటించడంతో జనం బయటకు రావడానికి జంకుతున్నారు. ఉదయం 10 గంటలకే ఎంత తీవ్రతతో 45 డిగ్రీలు దాటి వడ గాలులు వీస్తున్నాయి. దీంతో రహదారులన్నీ నిర్మానుషంగా మారాయి. ఇక చిరు వ్యాపారుల పరిస్థితి వర్ణనాతీతం. రోడ్ల వెంట, తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులు ఎండకు భయపడి పొద్దెక్కక ముందే ఇంటిముఖం పడుతున్నారు. చెట్లనీడన చెరుకు, నిమ్మ రసం, పండ్లు, కొబ్బరి బొండాలు అమ్ముకునేవారు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ వ్యాపారం చేసుకుంటున్నారు. అయినా.. ఎండలకు భయపడి జనం బయటకు రాకపోవడంతో కొనేవారు లేక బేరాలు సైతం తగ్గిపోయాయి. సాయంత్రం 6 గంటలు దాటిన తర్వాత రోడ్లపై కాస్త జన సంచారం కనిపిస్తోంది.

### మరింత అప్రమత్తంగా ఉండాలి



జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకునేలా వివిధ శాఖల అధికారులను అప్రమత్తం చేశాం. అత్యవసరమైతేనే ప్రజలు బయటకు వెళ్లాలి. వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. చలివేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు. బస్సులలో ప్రయాణించే వారు తప్పనిసరిగా వాటర్ బాటిళ్లను వెంట తీసుకెళ్లాలి. నీళ్లు ఎక్కువగా తాగడం వల్ల వడదెబ్బ తగలకుండా ఉంటుంది. ఎండల తీవ్రత వల్ల సుస్తీగా ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యుల సలహా తీసుకోవాలి. వడదెబ్బ అనేది సైలెంట్ కిల్లర్. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ముఖ్యం.

– కలెక్టర్ ప్రియాంక ఆల